# పాముల నిచ్చెన

"వీ్రనవాడు యూరపు వెళ్తున్నాట్ట–" అని కాఫీముగించి అల్లంముక్క నోట్లో వేసుకున్నాడు చలపతి.

"హా!" అన్నాడు కంసుడు (కందాళపాలెం సుబ్బరాముడు)

ఇంక చూస్తూ ఉండు.... చాగ్లా తర్వాత వీడు మన ఎడ్యుకేషన్ మినిస్టరయి పోతాడు–"

"బాబోయ్–" అని వణికిపోయాడు కంసు.

అది మే నెల. ఎంత క్రొత్తవాడయినా వణకవలసిన ఋతువు కాదది ఢిల్లీలో.

* * *

సుమారు ఏడాది కింద ఒకనాడు పాత ట్రంకు చేత ధరించి రాజధానిలోకి దిగాడు ఎం. ఎస్. పీతాంబరరావు అన్న నీలమేఘశ్యాముడు. కరోల్బాగ్ అయితే బాగుంటుందనీ, అక్కడ దేశం వాళ్ళుంటారు కదా అనీ నెమ్మదిగా అక్కడికి చేరాడు. కాని తీరాచూస్తే ఎక్కడ దిగడమో తెలియలేదు. ఒకానొక గోల్‌చక్కర్‌వద్ద చక్కర్లు కొడుతుండగా ఇతడిని గమనించిన రామ్మూర్తి అడిగాడు: "అయ్యా! మీరు తెలుగువాళ్ళా?" అని.

అంతే! ట్రంకుపెట్టెను క్రిందకు దించి, అమాంతం ఎగిరి గంతేసి రామ్మూర్తిని గట్టిగా కౌగలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు పీతాంబరుడు.

ఇదేదో 'దౌర్జన్య చర్య' కాబోలు ననుకున్న కానిస్టేబిల్, హుకుం సింగు వో నిముషంఆగి ఆ తర్వాత, అలవాటుచొప్పున 'చాయ్' దుకాణం లోకి దూరిపోయాడు. పాపం రామ్మూర్తి!-దేశంకాని దేశంలో దేశంవాళ్లు ఒకరికి ఇంకొకరినిచూస్తే ఎంత ఇదో అనుకున్నాడు, పీతాంబరపు కౌగిలిని విడిపించుకున్నాడు. పీతాంబరాన్ని తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. స్నానం, భోజనం, ఉండడానికి గది-అన్నీ ఏర్పాటు చేయించాడు. "అయ్యా! మీకో ఉద్యోగం దొరికి, మీరింకో గదిలోకి మారేదాకా మా ఇంట్లోనే-మా ఇంట్లో ఒకరుగా ఉండండి-" అన్నాడు శ్రీరామచంద్రుడిలాటి రామ్మూర్తి. 'ఇంతకన్న కావలెనా!'

ఇరవై నాలుగు గంటలలో స్థానబలిమి సంపాదించుకున్న పీతాంబరం స్వంత బలిమి నిమిత్తం కార్యక్రమం ఆరంభించాడు. నాలుగు రోజులలో కరోల్బాగులోని 'మన' వాళ్ళందరి జాబితాను తయారుచేశాడు. కొందరితో చుట్టరికం కలిపాడు. కొందరిని (మగవారిని) కౌగలించుకున్నాడు. కొందరితో కలిసి కృశ్చేవ్‌మీద ఘాటయిన అభిప్రాయాలిచ్చాడు.... ఈ విధంగా కరోల్బాగయింతర్వాత మోతీబాగ్, లోడీకాలనీ, ఇత్యాదిచోట్లగల 'మన' వాళ్ళందరిని పనిగట్టుకుని వెళ్ళి పలకరించి వచ్చాడు. ఇవ్విధమున పక్షం రోజులలో అందరికీ తను తెలిసిన వాడయ్యాడు పీత.

ఒక నెల తర్వాత ఒకరోజు అమర్ కాలనీలో ఉన్న సుబ్బారావు గారింటికి వెళ్ళాడు పీత.

మాటల సందర్భంలో-గమనించాడు హాల్లోని టేబిల్ మీద శిల్పాన్ని.

ఈలోపుగా ఆకుపచ్చ కోటాయన కారులోకి ఎక్కనుండటం గమనించిన పీత కరిమీదకి లంఘించు సింహంబు కరణి లంఘించాడు. తన సంచినుండి తీసి కాబినెట్ సైజ్ ఫోటోని ఆకుపచ్చ కోటాయనకు అందించాడు. 'ఆకో' ఆ ఫోటోని చూశారు. అందులో తనూ మంత్రిగారూ ఉండడం గమనించారు. కాస్త వెనకాతల సిగ్గుపడుతూ నిల్చుంది ఎర్రకోట....

రెండువారాలు తిరక్కుండా ఉద్యోగం వచ్చింది పీతకు. ఇంకో వారానికెల్లా రామకృష్ణపురంలో ఒక వాటాని అద్దెకు కుదుర్చుతున్నాడు. రామ్మూర్తి కుటుంబంతోసహా సినిమాకు వెళ్ళినపూట పీత రామ్మూర్తి ఇచ్చిన గదిని ఖాళీ చేశాడు.

పీత ఉద్యోగంలో చేరిన నెలతర్వాత దక్షిణాదినుండి ఒక యాత్రా స్పెషల్ వచ్చింది. అందులో ఉన్న జనంలో–"ప్రపంచంలో ఎనిమిదో వింత–ఆంధ్రులలో ఐకమత్యం"–అన్న సిద్ధాంతం రాసిన డాక్టర్ సిద్దేశ్వర్రావు, సుప్రసిద్ధ వేణుగాన విద్వాంసుడు, మనోహరమూర్తి, ఆంధ్రతప్ప దేశమంతా ఎరిగిన చిత్రకారుడు డాక్టర్ చారిగారూ ఉన్నారు.

ఈ ముగ్గురికీ సన్మానం చేసితీరాలని తాతారావూ, పేరిశాస్త్రీ కలిసి తీర్మానించారు. వీళ్ళిద్దరూ ఎవరూ అంటే 'సన్మానాల స్పెషలిస్టు' లని చెప్పుకోవచ్చును. "తెనుగుబిడ్డలు గడ్డను విడిచి ఇంతదూరం వచ్చినపుడు వాళ్ళని మనం కాకపోతే మరెవరు ఆదరిస్తారు? ఉజ్జ్వలమైన సంస్కృతికి వారసులం మనం. దానిని పోషించకపోతే–(ఇసీ 1) మనము మనమే" లాటి డైలాగులు చాల అనుకుని, తాతారావూ, పేరిశాస్త్రీ కలిసి హూటాహూటిని బయలుదేరి ఇచ్చినవాళ్ళదగ్గర చందాలు, ఇవ్వనివాళ్ళదగ్గర ప్రోత్సాహపు కబుర్లు, అయిడియాలు వసూలుచేసుకుని, ఆదివారం ప్రొద్దున అనంతపద్మనాభస్వామి ఆలయ ప్రాంగణంలో చారి, సిద్దేశ్వర్రావు, మనో

హరమూర్తి గారలకు సన్మానం ఏర్పాటు చేశారు. ఆ విషయాన్ని పత్రికలలో వేయించారు. కరపత్రాలు పంచిపెట్టారు.

ఆదివారం వచ్చింది.

ఆహూతులందరూ ఆసీనులయ్యారు. పెద్దవాళ్ళు ముగ్గురికీ మాలలు వేశాడు తాతారావు. పేరిశాస్త్రి పెద్దలు ముగ్గురి గురించి మూడు ముక్కలు చెబుతానని లేచినిల్చుని–"మా సంస్కృతీ సంఘం తరపున–" అంటుండగా అడియన్స్‌లోంచి విశ్వామిత్రుడు లేచాడు: "నాన్సెన్స్! మీది సంస్కృతీ సంఘం కాదు. మీది సమాజం. సంస్కృతీ సంఘం అంటే మాది–మా మేనమామ స్థాపించింది. కావాలంటే రిజిస్ట్రార్ ఆఫీసుకు పదండి. లేదా రిట్ పిటిషన్ పంపిస్తా కాచుకోండి"–అంటూ మీసం ఉండాల్సినచోట చేయివేశాడు.

అక్కడ కూర్చున్న–(ముగ్గురి పెద్దలతో కలిపితే) ముప్పై తొమ్మిది మందిలో ఒకడయిన కంసుడి తల సిగ్గుతో ఇదివరకే వంగిపోయినది. ఇప్పుడు దానిని నేలకేసి కొట్టుకుందామనిపించింది.

రెండునిముషాల తర్జన భర్జన తర్వాత, విశ్వామిత్రుడి వాకౌటు పిదప, పేరిశాస్త్రియొక్క మూడువేల ముక్కల పిమ్మట–పరమ రమణీయమైన నాటకీయతతో–తటాలున లేచినిల్చుని "అధ్యక్షులవారనుమతిస్తే మన ఈనాటి ఘనమైన అతిథులమీద నేను రాసిన కొన్ని పద్యాలు చదివి వినిపిస్తా" నన్నా డొకాయన. కాకులమధ్య ఈ గండు కోయిల ఎవరా అని గమనించిన కంసుడికి పీత కనపడినవాడాయెను....

గబగబ మూడు పద్యాలు చదివిన పీత అంతటితో ఆగలేదు. "సోదరులారా! మీ రనుమతిస్తే ఇటీవల మొన్న మొన్ననే వెళ్ళిపోయిన సంక్రాంతిమీద నేను రాసిన గేయాన్ని మనవిచేసుకుంటాను ఈ గేయం

యొక్క ప్రత్యేకత ఏమిటంటే, దీనిని కేవలం ఒక్క సంక్రాంతికేకాక సర్వ సంక్రాంతులకూ వరిపడే స్థాయిలో రచించడమైనది" అంటూ ఆ గేయం పఠించాడు. శ్రోతల చప్పట్లు విన్పించుకోకుండా అది ముగించి ఇంకా ఇలా అన్నాడు పీత:

"నెహ్రూగారు గతవారం రేడియోలో చేసిన ప్రసంగం విన్న తక్షణం నాలో ఉప్పొంగిన భావతరంగాలను కాగితంమీద పెట్టాను. 'ఏము కల గూళ్ళు-ప్రగతికి రాళ్లు' అన్న ఈ గేయం తాలూకు ఇంగ్లీషు తర్జుమా నిన్ననే నెహ్రూగారింటో ఇచ్చి వచ్చాను. మిగతా పదమూడు దేశభాషలలోకి దీన్ని తర్జుమాచేసే విషయంమీద ఏఐయ్యార్ వాళ్ళకి రాశాను-"

ఇక లాభం లేదనుకున్నారు కాబోలు-తాతారావూ పేరిశాస్త్రీ కలిసి పీతయొక్క చెరో రెక్కా పట్టుకుని సీటుని చూపించారు.

వచ్చిన పెద్దలలో ఒకాయన-గట్టిగా ఊపిరి పీల్చుకుని "అయ్యా! ఈ మహానగరంలో మీరింతమంది తెనుగువాళ్ళు తీరికచేసుకునివచ్చి మాకు ముక్తకంఠంతో ఇట్లా ఘనంగా చేసిన సన్మానానికి ఎట్లా కృతజ్ఞత చెప్పాలో తెలియకుండా ఉంది-" అని కూర్చున్నారు. ఆయన వేసిన జోక్ ఇంకెవరికన్నా అర్థమయిందేమోనని పరీక్షించాడు కంసుడు. కెమెరా సరిచేసుకుంటున్న పీతకు, భారత ప్రభుత్వంవారి ఒక శాఖలో అతి పెద్ద స్థంభంలాంటివా రొకరితో కలిసి ముసిముసినవ్వు లాడుతున్న పేరిశాస్త్రి, తాతారావూ కన్పించారు.

ఆ రాత్రి ఆకాశం క్రింద బర్సాతీ చెప్పాడు-"నాన్నా కంసుడూ! ఇంద్రభవనవాసులు మాట్లాడే భాషవేరు. అందులో దేశసేవ అంటే 'సీనియారిటీతో పనిలేని ప్రమోషన్' అని అర్థం. సన్మానం అన్నది ఒక లక్ష్యంకాదు అది 'ఇంకో లక్ష్యానికి రాచబాట' అని తెలుగులో చెప్పాలి."

ఆపాటికి అర్నెల్లయి ఆ వూళ్ళో వుంటున్న కంసుడూ అందు కున్నాడు. "అయితే మరి వలభై మందికి మించనిదయితే సభ అని పేరు. అంతకన్న ఎక్కువమంది ఉంటే-అది మహాసభ అనుకోవచ్చు....

"బేష్, మేనల్లుడా బేష్‌! నువ్వు గ్రహిస్తున్నావన్నమాట. మరొక్కటనుకో బుల్లోడా! ఏదయినా హాలులోని సామాగ్రి అంతా ఆరోగ్యంగా ఉంటే అక్కడ సభగావి, మహాసభకావి జరుగలేదని తిరుమలేశుడి భావము-"

కంసుడు నవ్వాడు. కాని అది నవ్వుకాదు-

-ఇంకోరోజు పొద్దుటివేళ.

అనువచ్చు కోటాయన వాళ్ళ బంగళా వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. ఇంతలో వాళ్ళావిడ అటొచ్చింది. ఒక్క చూపు చూసింది. పేపర్ చదివే మొగుళ్ళమీద పెళ్ళాంకుండే కోపమంతా ఆ చూపులో వింపివుంది.

"మీరేమీ బొత్తిగా పట్టించుకోవడమేలేదు-" అంది త్రిపుర సుందరమ్మ.

పత్రికనుండి ఇటు తిరక్కుండానే అన్నాడు అనువచ్చు కోటాయన. "త్రిపురం! త్రిపురం.... ఇదిగో విను! రుమానియాలో మాట్లాడుతూ కృశ్చేవ్ ఏమన్నాడంటే...."

"ఆ....ఏమంటాడూ-ఇంటి మొగాడిని కొంపలో విషయాలు చూడమంటాడు-" అంటూ పేము కుర్చీ లాక్కుని ఆయన ఎదుట కూర్చుందావిడ.

అకోగారికి కృశ్చేవ్ మాటలకన్న వాళ్ళావిడ మాటలు 'మోస్ట

అర్జెంట్ అనిపించాయి. పేపర్ క్రిందపడేశారు—"ఏమిటోయ్ నీ పాట?" అంటూ.

"అవునవును. పాటగానే ఉంటుంది! ఎందుకుండదూ—? ఒకప్రక్క—రాధేమో రాత్రిఝ్ము పదింటికి ఇంటికి వస్తూంది.... ఇహ, మీరో భారతదేశ సంస్కృతీ, చామదుంపా అవి పోరాడి సీతను బియ్యేలో సంస్కృతం తీసుకోమంటిరి. ఇప్పుడేవన్నా ఆ పిల్ల నాకేదీ బోధపడ్డంలేదోనని మొత్తుకుంటూంది.... మీరేమో—"

ఆకో అడ్డొచ్చారు. "ఆవు త్రిపురం, నువ్వావు! నేను చెబుతా విను.... ఇంతకూ నువ్వు వెలవిచ్చింది రెండు విషయాలు. ఒకటి—రాధ పెళ్ళి—రెండు—సీతకు ట్యూషన్.... ఈ రెంటినీ గమనించాలి. అంతేనా?"

"ఆ!"

"ఈమాత్రందానికి అంత పెద్ద 'నోట్' ఎందుకు రాశావో అర్థం కావడంలేదు."

"నేను ఏవిటి రాశానూ?"

"అబ్బే ఏం లేదులే! నువ్వు చెప్పే మాట నేను విన్నానుగా, ఇహ నేను చెప్పేది విను—కృశ్చేవ్ బుకారెస్టులో మాట్లాడుతూ కాశ్మీర్...."

త్రిపురసుందరమ్మ గిరుక్కున లేచి లోపలికి వెళ్ళిపోయింది. కృశ్చేవ్ వాళ్ళావిడకూడా ఇట్లాగే ఉంటుంది. లేకపోతే ఆ మానవుడు ఇంటిపట్టున ఉండకుండా ఎప్పుడూ దేశాలెంబడి తిరుగుతుండనేల—అని అతడిమీద జాలిపడ్డారు ఆకో.

—మధ్యాహ్నమే ఆఫీసులో డిప్యూటీ సెక్రటరీ ఎందుకో తన దగ్గరికివస్తే రాధకు సంబంధం, సీతకు ట్యూషను—ఈ రెండు విషయాలూ

అతడితో ప్రస్తావించారు ఆకో. డి. సెక్రటరీ అత్యుత్సాహంతో తల ఆడించి తన గదికొచ్చి అండర్ సెక్రటరీని కేకేశారు. అం. సె. తన సెక్షనాఫీసరుకు సమస్యను వివరించాడు. రామకృష్ణాపురంలో ఉంటున్న ఆ సెక్షనాఫీసర్ ఆ సాయంకాలం తన ప్రక్కింటాయనతో కబుర్లాడు తుండగా ఈ వూసొచ్చింది.

....అంతే, ఆ పక్కింటాయన రాత్రి ఏడున్నరవేళ భోజనంకూడా చేయకుండా ఆటోరిక్షా చేసుకుని శరవేగంతో లివ్‌లిత్‌గో రోడ్ జేరాడు.

ఆకుపచ్చ కోటాయన భోజనంచేసి చేయి కడుక్కుంటుండగా దర్వాన్ వచ్చి చెప్పాడు "ఆరోజు-జిమ్మీని అదరగొట్టిన వ్యక్తి వచ్చా డ"ని. ఆకో ముందు వరండాలోకి వెళ్ళారు.

ఆ వచ్చిన వ్యక్తి సాష్టాంగపడి, లేచి సిగ్గుపడి, భక్తిప్రపత్తులతో తగుమాత్రంగా వణికి, నవ్వి ఆఖరున అన్నాడు. "తమ ఇంట్లో సంస్కృతం ట్యూషన్ చెప్పేవాళ్ళు కావాలిటగా-"

తల ఆడించారు ఆకో.

"నా ప్రాణమిత్రుడొకాయన ఉన్నాడు పేరిశాస్త్రి అని. అతడు సంస్కృతంలో నిధి" అని వర్ణించాడు పీతాంబరం.

'రెండింటిలో ఒక సమస్య తీరింది, హమ్మయ్య!' అని నిట్టూ ర్చారు ఆకో. ఆయన పీతాంబరానికి కృతజ్ఞత చెప్పుకున్నారు.

"హన్నన్న ....ఎంతమాట.... రేపొద్దున పేరిశాస్త్రిని లాక్కొచ్చి మీ పాదాలదగ్గిర పడేయ్యమంటండీ-" అని సెలవు తీసుకున్నాడు పీత.

అక్కడినుండి పటేల్‌నగర్ వెళ్ళి కళానిలయంలోని పెద్ద ఆఫీస రొకాయనను కలుసుకున్నాడు. అన్నానికి వెళ్ళబోతున్న ఆయన్ని ఆపి

ఆయన జీవిత వివరాలడిగి రాసుకున్నాడు. "తెలుగుజాతి బాగుపడాలంటే మీలాటివాళ్ళ జీవితాలు వెలుగులోకి రావాల్సార్—" అని ఆయన్ని ఫోటో తీశాడు. చివరికి సరంజామా అంతా సర్దుకుని బయల్దేరుతూ "సార్! మీకు వీలుంటే కాస్త ఈ 'దీపావళి' గేయం వెలుగులోకివచ్చేట్టు చూడండి సార్—" అని రాత్రి పన్నెండింటికి చీకటిలో ఇల్లు చేరాడు.

పొద్దున్నే కళానిలయం పెద్దమీద వ్యాసం రాసి తెనుగుదేశంలో ఒక పత్రిక్కి పంపించాడు. అలాగే ఆ పత్రికకు వరసగా పది వారాలు పది మందిమీద వ్యాసాలు పంపాడు. పేజీలు నింపడానికి వస్తువులేని ఆ పత్రిక వాళ్ళు ఈ వ్యాసకర్తయొక్క అమోఘమయిన సారస్వత సేవను ప్రశం సిస్తూ ఒక సంపాదకీయమే రాసేశారు!

సీత ఆ సంపాదకీయాన్ని కత్తిరించి, దాన్ని ఇంగ్లీషు తర్జుమాతో సహా ఇంకో పెద్ద ఉద్యోగానికి పెడుతున్న అప్లికేషన్‌తో జతపరిచి పంపాడు. ఇంకోరోజు 'భాంగ్రా' నృత్యాన్ని గురించిన ఇంగ్లీషు వ్యాసం ఒకటి చదివాడు. పంజాబీ కథకు డొకాయన దగ్గరకువెళ్ళి "తింటే పుల్కాలే తినవలె, కంటె భాంగ్రాయే కనవలె" నంటూ గేయం చదివేసి ఆయనచేత తన గేయాలు కొన్ని పంజాబీలోకి రాయించాడు. అందులో కొన్ని రేడియో వాళ్ళ కిచ్చాడు.

ఇంతలో వచ్చింది రిపబ్లిక్ దినం. ఎముకలు కొరికే చలి. అయినా జనం ఉత్సవాలు తిలకించడానికి తయారయ్యారు.

ఆకుపచ్చ కోటాయన ఇచ్చిన పాసుతో రాజ్‌పథ్‌కు ఉత్తరంగా రాష్ట్రపతి ఆసనానికి ఎదురుగా కూచున్నాడు సీత. సైనిక విన్యాసాదులు తిలకించాడు. నలుగురికి వినపడేట్లు "ఆ! రాష్ట్రపతి మావూరి వారే!" నన్నాడు. ఓ డజను ఫోటోలు తీశాడు. అరఫర్లాంగవతల లక్షమందిలో ఒక డుగా, కానిస్టేబుల్ చేతికర్ర నీడలో కూర్చుని ఉన్నాడు—రామ్మూర్తి.

రిపబ్లిక్ దినసందర్భంలో ప్రదానంచేసే బిరుదులను అందుకోవ డానికి అనేకులు వచ్చారు. వారిలో ఒకరు మదరాసునుండి వచ్చిన నారా యణరావుగారు. ఆయన తన గాన మాధురితో తెనుగుదేశాన్ని పాతికేళ్ళ నుండి ఉర్రూతలూగించారు. ఆయన్ని దేశం ఈనాడు గుర్తించి సత్క రించింది. బిరుదు ప్రదానంచేసి రాష్ట్రపతి తనతో కరచాలనంచేసి మాట లాడిన క్షణం నారాయణరావుగారి జీవితంలో అతి గొప్పది. స్వర్గమే తన అరచేతికి వచ్చినట్లనిపించింది ఆ క్షణం ఆయనకు. సరిగా ఆ క్షణాన్నే ఒక ఫోటో లాగేశాడు పీత.

మరునటిరోజు సాయంకాలం అష్టకష్టాలూపడి, వాకబుచేసి కను క్కుని, నారాయణరావుగారు బసచేసిన ఇంటిదగ్గర దిగుమతి అయ్యాడు పీత. బయట ఎవరో అడ్డుపెడితే వాళ్ళని తోసుకుని లోపలికి వెళ్ళిపోయి మాట్లాడకుండా నారాయణరావుగారి చేతికి ఫోటో ఇచ్చాడు. రావుగారు ఉప్పొంగిపోయారు. ఆ పొంగులో వారింకా ఉండగానే తాప్పున జేబు లోంచి వో కాగితం తీసి—"మేష్టారూ! ఇది నా గుండెలనుండి వచ్చిన గీతం! చెయ్యాలి దీన్ని మీరు గానం! కావాలి నా జన్మ ధన్యం—" అని కూచున్నాడు.

నారాయణరావుగారి గొంతుకలో వెలక్కాయ పడింది. ఆయన దానిని మింగి, ఈ గీతాన్ని కక్కారి! ఆ తర్వాత చెవులు పిండి వారినుండి ఒక యోగ్యతాపత్రాన్ని పుచ్చుకున్నాడు పీత. మద్రాసువస్తే తప్పక మీ దర్శనం చేసుకుంటాను—" అని అతడు బయలుదేరుతూండగా అతి త్వరలో ఏ ఖాట్మండుకో వెళ్ళి స్థిరపడితే క్షేమమని తోచింది నారాయణరావు గారికి.

పీత వెళ్ళిన అరగంటతర్వాత రామ్మూర్తి వచ్చాడు నారాయణరావు గారివద్దకు.

"ఏంవోయ్ రామం! నీ కోసం గంటనుండి ఎదురుచూస్తున్నా."

"ఇక్కడికనే బయలుదేరానండి. దారిలో ఇంకోపని తగిలింది. మా ఎదురింటి అబ్బాయిని ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది. ఆస్పత్రినుండి బస్సుదొరక్క ఆలస్యమయింది."

"ఓహో! ఇక్కడకూడా నువ్వు వేయిళ్ళ పూజారివన్నమాట. వెనకటికి బాపట్లలో మీ నాన్నా ఇంతే! అడిగినా అడగకపోయినా అందరి అవసరాలకూ ఆదుకునేవారు.... ఆ చెట్టు కొమ్మలేగా–" అంటూ వాత్స ల్యంతో చూచారు.

రామ్మూర్తి నవ్వాడు–"లెండి మేష్టారూ, టైమయింది. చాందినీ చౌక్‌లో ఏవో కొనాలన్నారు కదూ–"

మేష్టారు లేచారు. దారిలో రామ్మూర్తికి, యోగ్యతాపత్రం పుచ్చు కున్న గేయకర్త కథ చెప్పారు. అతడు నవ్వి ఊరుకున్నాడు....

–పీత అంతకుముందు పెద్ద ఉద్యోగానికి అప్లికేషను పంపిన ఆఫీ సుకు, నారాయణరావుగారూ, రాష్ట్రపతి ఉన్న ఫోటోను పంపిస్తూ, "ఇదిగో ఈ ఎడంవైపు ఉన్న ఆయన నాకిచ్చిన యోగ్యతాపత్రం" అంటూ ఉత్తరం పంపాడు. అంతటితో ఊర్కోలేదు. అనేక గుమ్మాలదగ్గర పడి గాపులు గాచాడు. అమెరికా అధ్యక్షుడుగా కావడానికి సరిపడేంత కృషి చేశాడు. మరి–కృషితో నాస్తి దుర్భిక్షం కదా!

అంచేత ఆ ఉద్యోగం వచ్చింది పీతకు. అతని జీతం నెలకు రెండు వందలనుండి ఐదువందలు రూపాయలకు పాకింది చీకటి పాకినట్లు. ఆరే ళ్ళయినా రామ్మూర్తి మూడువందల పాతికైదులోనే ఉన్నాడు. మరి అత డికి పిచ్చెసలు వేసుకోవడం–తెలియదు గనుక! జీవితాన్నిప్పుడే నేర్చు కుంటున్నవాడు కనుకు, అతడి జీతం రెండువందలు దాటకపోవడం సహా

జము....నాలుగు రోజుల తర్వాత—ఒకరాత్రి త్రిపురసుందరమ్మ హెచ్చరించింది వాళ్లాయన్ని—"ఏవండోయ్! మంచి ముహూర్తాలన్నీ దాటిపోతున్నాయి—"

"ఎక్కడికి?" అన్నారు ఏదో రిపోర్టు చదువుకుంటున్న ఆకుపచ్చ కోటాయన.

"చాల్లెండి సంబడం....చెప్పేది వినండీ—" రిపోర్టులో చదివినంత వరకు గుర్తుపెట్టుకుని భార్యని చూశారు ఆకో.

"ముహూర్తాలూ—దాటి—పోతున్నాయీ—పెద్దమ్మాయి రాధ ఒక ఇంటి కోడలు కావడంలేదూ అని చెప్పొచ్చాను—" అంటూ చెవిటివాడికి శంఖం ఊదినట్లు చెప్పింది త్రిపురసుందరమ్మ.

ఆకో నవ్వారు!

"అలా నవ్వకండి! ఆ నవ్వు చూస్తే నాకు మహా చిరాకేస్తుంది—"

"ఇదిగో త్రిపురం....ఎందుకట్లా అనవసరంగా బాధపడతావు? నువ్వు మూడునెలలక్రితం ఈ 'ప్రొపోజల్' పెట్టావుకదూ, అప్పటినుండీ ఫైలు నా ఎదుటే ఉంది. చూడగా చూడగా నాకో 'సొల్యూషన్' తోస్తుంది."

"మిమ్మల్ని తోస్తున్నది ఏవిటి?"

ఆకో నవ్వి చెప్పారు. "అబ్బెబ్బే! నువ్వుండ నన్ను ఇంకెవరు తోస్తార్లే....ఈ....ఏడయిన రాధ పెళ్ళి సమస్యకు ఒకానొక—ఒకానొక జవాబు గదా—అనగా పరిష్కారం, ఆ!! అద్గదీ, పరిష్కారం తోచుచున్నది—

"నా దృష్టిలో ఒకబ్బాయి ఉన్నాడు. మనవాడే....పోయిన్నెలదాకా మాఆఫీసులో నేఉన్నాడు. బియ్యే నాలుగయిదుసార్లు కట్టినట్లున్నాడు. ఇంకో రెండు మూడు ప్రయత్నాలలో యూనివర్సిటీ వాళ్ళకే వోపిక

హరించిపోయి రాజీకింద డిగ్రీ ఇచ్చేయవచ్చు. ఇహపోతే పైకిరాగల లక్షణాలన్నీ ఉన్నాయి కుర్రవాడిలో. ఏం: ఇంచక్కా పాటలూ అవీ రాస్తాడు, ఫోటోలు తీస్తాడు..."

"ఇహనేం.... ఇద్దరూ కలిసి పాడుకోవచ్చు—" అంది త్రిపురసుందరమ్మ నవ్వుతూ.

"ఆ పాడుకోవచ్చు.... కాని అతడి స్వరంకూడా ఆకారంలాగే ఉంటే మాత్రం—"

"ఆ పోదురూ మగవాడికి అందమేవిటి?"

"కుర్రవాడిది మరీ దబ్బపండు చాయకాదు—"

"అక్కడికి మీరేదో పసిడిచాయ అయినట్లు—"

"అది కాదే—నేను—హూం.... అతడి ప్రక్కన నిల్చుంటేనా ఎంతో శ్రేష్టమైన తెలుపురంగు నాది...."

"ఫరవాలేదులెండి.... సంబంధం నిశ్చయం చేయండి—"

"మరి రాధ ఒప్పుకోవద్దూ—"

"దాన్ని ఒప్పించే పూచీ నాది. ఈ సంబంధాన్నిమట్టుకు చెయ్యిజారనివ్వకండి. మరి ఈ మధ్య వాడెవడో దిలీప్ సింగట—తెగ వస్తున్నాడు దాని కోసం. వెధవ గడ్డమూ—వాడూనూ.... ఆ దుబ్బుని చూస్తేనేచాలు అగ్గి పెట్టి వెతకబుద్దేస్తుంది—"

"అబ్బా.... అందాక పోయిందీ వ్యవహారం—అయితే మరి ఆలస్యం అమృతం విషం——"

"పోన్లెండి కనుక్కున్నారు కదా!" అని నవ్వింది త్రిపుర సుందరమ్మ....

....ప్రతీ మనిషికీ ఒక పిచ్చి ఉంటుంది. రిటైర్డ్ ఇంజనీర్ శేషయ్య గారికి కవిత్వమంటే పిచ్చి. పెళ్ళయిన కొత్తలో వాళ్లావిడకు ఆటవెలది,

'శతగీత'లలో ఉత్తరాలు రాసేవారాయన. ఆయన ఇక్కడ అప్పుడప్పుడూ కవితా గోష్ఠులు ఏర్పాటు చేస్తుంటారు. ఆనవాయితీ ప్రకారం ఉగాదిరోజున ఒక గోష్ఠి ఏర్పరిచారు. వూళ్ళో వున్న నలుగురు కవితారాధకుల్ని కేకేశారు. 'చీటికి ప్రాణము వ్రాలుమ' అన్నట్టుగా సభకు ప్రాణము మంత్రిగారుగదా....అంచేత ఆయన వచ్చారు.

కంసుడూ వెళ్ళాడు శేషయ్యగారింటికి. ఆ పాటికే వచ్చి ముందర వరసలో కూర్చుని ఉన్నాడు పీత. గోష్ఠి మొదలయింది. సభాధ్యక్షుల సర సోక్తులను పఠితులు యధోక్తంగా రచించారు. గంటన్నరసేపు సరదాగా గడిచింది కవితా పఠనం ముగిసింది. మంత్రిగారు లేవగా మిగిలినవారూ ఆ పనే చేశారు. కంసుడు లేచాడు. ఎందుకో సందేహంవచ్చి పరిశీలించాడు. పీత కనబడలేదు! ఆశ్చర్యపడి కంసుడు అందరితోబాటు మేడమెట్లు దిగి వీధిలోకి వచ్చాడు.

అందరివద్ద సెలవు తీసుకున్న మంత్రిగారు కారువైపు తిరగగానే, తలుపుతీసి పట్టుకున్న పీత కనబడ్డాడు.

"ఏంవోయ్!" అవి లాంఛనంగా ఆయన పలకరించారు. సిగ్గు, భయం, భక్తి–అన్నీ తగుపాళ్ళలో కలిపి మొహానికి పూసుకున్నాడు పీత.

ఆయన కారులోపలికి వెళ్ళి కూచున్నారు. అందరూ నిలబడి చూస్తున్నారు. తీసిఉంచిన కారు తలుపుమీద చేతిని తీయలేదు పీత.

"పీతాంబరం! నువ్వూ ఆటొచ్చేట్లయితే రా–" అన్నారాయన. లంకకు ఎగిరిన ఆంజనేయుడిలా కారులోకి ఎగిరిపడ్డాడు పీత. తలుపు మూతపడింది.

కారు బయల్దేరింది.

పైన మేడమీద తివాసీలు తీసి మడవడంలో శేషయ్యగారికి సాయం

చేస్తున్న రామ్మూర్తి ఇదంతా గమనించలేదుగాని కంసుడు చూసివెళ్ళి, ఇంటిదగ్గర చలపతికి చెప్పాడు.

"అవునూ! అదొక పద్ధతి.... అందులో తప్పేముందీ–" అని పెరుగన్నం ముగించి ఫ్లాస్కు-లోనుండి కాఫీ గ్లాసులోకి వోసుకున్నాడు చలపతి.

–మళ్లా అగస్టొచ్చేసరికి ప్రపంచ రాజకీయాలలో అనేక మార్పులు వచ్చాయి. కాశ్మీర్‌లాటి విషయాలమీద మన దేశాన్ని విదేశీయులు సరిగా అర్థంచేసుకోవడం లేదని తెలిసొచ్చింది. అనగా మనదేశంనుండి ఒక సాంస్కృతిక ప్రతినిధివర్గం బయలుదేరి యూరపు, ఇంగ్లండు పర్యటిస్తే–అంతర్జాతీయంగా మన సంబంధాలు బాగుపడతాయని తొమ్మిదో మంత్రిగారన్నారు. ఆ మేరకు ఆ శాఖ సెక్రటరీ నల్లసూటాయన ఏర్పాట్లు మొదలెట్టారు. సాంస్కృతిక ప్రతినిధివర్గానికి ప్రసిద్ధ గాయకులు నారాయణరావుగారిని నాయకుడిగా సూచించారు. నల్లసూటాయనకు, క్లబ్బు మిత్రుడు ఆకుపచ్చ కోటాయన–వాళ్ళావిడ ఒకటికి నాలుగుసార్లు చెప్పగా పీతాంబరాన్ని లిస్టులో వేయించారు. ఇది తెలిసిన నారాయణరావుగారు ప్రతినిధివర్గంనుండి తప్పుకున్నారు. అప్పుడు పీతాంబరమే నాయకుడయాడు! యూరపుకు బయలుదేరాడు....

"వేణుగాన ధురీణుడు మనోహరమూర్తి ఈ సాంస్కృతిక రాయబారులలో లేకపోవడం దారుణం!" అన్నాడు ఆ ప్రతినిధివర్గం లండన్‌లో దిగిన పత్రికా వార్త అప్పుడే చదివిన రామ్మూర్తి.

"అనగా అనగా మీ ఇంట్లో రెన్నెల్లుండి చెప్పకుండా వెళ్ళిపోతూ, అడగకుండా తీసుకెళ్ళిన రెండు కుర్చీలను వెనక్కి-వ్వకుండానే–విదేశాలకు చెక్కే-సిన వాడిని ఏమంటారు?–" అని ప్రశ్నించాడు కంసుడు.

"కాలుడు అవవచ్చు–" అని సూచించాడు. ఈ మారు పేర్ల విషయంలో పెద్ద రీసెర్చి చేసిన చలపతి.

రామ్మూర్తి నవ్వాడు.

"నవ్వకోయ్!.... ఈ అన్యాయం చూస్తే మనసు దహించుకుపోతుంది. అర్హత కలవారందరూ మారుమూలల మగ్గుతూఉంటే ఈ.... ఈ....పనికిరాని....వీళ్ళందరూ మన డబ్బుతో విదేశాలూరేగడమా–" అని మండిపడ్డాడు. కంపల్సరి డిపాజిట్ విషయాన్ని మరవలేని కంసుడు.

ఈ డైలాగు విని విసుక్కున్నాడు చలపతి. "అబ్బా! కంసనాధం! అప్పుడప్పుడూ నువ్వు అజ్ఞానంలో పడిపోతుంటావు....ఆడకూతుళ్ళున్నవాడు ఆ మాత్రం ఆదుకోవడం సహజం. రేపు పెళ్ళయి నీకూ నలుగురు కూతుళ్ళు పుడితే తెలుస్తుంది. అందువలన చిట్టితండ్రీ! ఈ రొట్టెమీద కాస్త అదిగో, ఆ 'జామ్' పూసి రామ్మూర్తికివ్వు! నువ్వు నిమ్మరసంలో ఇంత ఐసుముక్క పడేసి తాగు–"....

—ఆ రోజు సాయంకాలం లండన్‌లో ఒక పెద్ద పత్రికా కార్యాలయంలో ఆ పత్రిక సంపాదకుడు, పదే పదే ధన్యవాదాలు తెలిపాడు!

"మిష్టర్–అంబర్! మీరెంతో దయతో బహూకరించిన ఈ శిల్పం బ్రహ్మాండంగా ఉంది!" అని పీతతో కరచాలనం చేశాడు. వాళ్ళిద్దరి మధ్య ఉన్న పెద్ద టేబిల్‌మీద–తటాకం మధ్య తామరపువ్వులా నిలిచివుంది 'వీణాపాణి' శిల్పం!

తృప్తిగా నవ్వాడు పీత. 'ఇతడిద్వారా రేపో ఎల్లుండో డ్యూక్ గారిని కలుసుకోవాలి' అనుకున్నాడు.

నా జీవితంలో ఇలాంటివెన్నో చూశాను–అన్నట్లుగా నెమ్మదిగా, విందుగా పాడుతోంది థేమ్సునది!

['ఆంధ్రసచిత్ర వారపత్రిక' జూలై 64]